నియోజకవర్గ గ్రిగ్స్ పోటీలకు పీకే పాలెం విద్యార్థినులు

విశాలాంధ్ర-కవిటీ: ఇటీవల రాజపురం ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి గ్రిగ్స్ పోటీలలో పెద్ద కర్రివాణిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కబడ్డీ సీనియర్స్ బాలికల విభాగంలో ద్వితీయ స్థానం కైవసం చేసుకొని నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఎం.మురళిప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో అభినందన సభ ఏర్పాటు చేసి విద్యార్థులకు హెచ్ఎం మురళి ప్రకాష్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాపారావు, కుముదకరరావు, రామచంద్రరావు, రామకృష్ణ, మురళీధర్, రామారావు, దుర్యోధన, లింగరాజు, డి. లింగరాజు, ధర్మారావు, గాయత్రి, ఎస్ఎంసి సభ్యులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది

ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న సచివాలయాలు
ఇదేంటని ప్రశ్నిస్తే ఫీల్డ్‌కి వెళ్లామని నిర్లక్ష్యపు సమాధానం
- జాడ లేని బయోమెట్రిక్
- గాడి తప్పుతున్న సచివాలయం వ్యవస్థ

విశాలాంధ్ర - ఎల్.ఎన్.పేట: గ్రామ సచివాలయం వ్యవస్థ గాడి తప్పుతోంది... సచివాలయం సిబ్బంది విధులకు ఎప్పుడు వస్తారో ఎప్పుడు రారో అనేది ప్రజలకు అర్థం కాలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఉదాహరణకు మండలంలోని లక్ష్మీనర్సుపేట, పెద్దకోట 1 సచివాలయానికి ఎల్ఎన్ పేట డిప్యూటీ ఎంపీడీవో జి.వెంకట అప్పలనాయుడు మంగళవారం ఉదయం 10-30 నిమిషాలకు వెళ్లారు. ఆ సచివాలయంలో ఖాళీ కుర్చీలు తప్ప ఏ ఒక్క శాఖ సిబ్బంది లేరు. ఇంతవరకు సచివాలయం సిబ్బంది రాకపోవడానికి కారణమేంటని ఆరా తీశారు. ఆ సచివాలయం ఎదుట పింఛన్ ధారులు, ఇతర లబ్ధిదారులు వివిధ పనుల మీద సచివాలయానికి వచ్చారు. వాళ్లందరికీ నచ్చజెప్పి మీరు ఏ ఏ పనుల మీద వచ్చారు మీ పనులు చేయించే బాధ్యత నాది అని వాళ్లకి భరోసా కల్పిస్తూ ఉన్నప్పటికీ అంతలో 11-05 నిమిషాలకు ముగ్గురు సచివాలయ ఉద్యోగులు వచ్చారు. ఇంత వరకు సచివాలయానికి రాకపోవడమేంటిని డిప్యూటీ ఎంపీడీవో కోరగా ఫీల్డ్‌కి వెళ్ళామని నిర్లక్ష్యపు సమాధానం చెప్పారు. వెంటనే సిబ్బందితోపాటు సచివాలయం లోపలికి వెళ్లి డిప్యూటీ ఎంపీడీవో సంబంధిత రికార్డులను పరిశీలించగా సచివాలయ సిబ్బంది రికార్డుల్లో సరిగ్గా హాజరు కూడా లేదని దీనిపై ఉన్నతాధి కారులకు నివేదిస్తానని ఆయన స్థానిక విలేకరులకు తెలిపారు.. ఏ ఒక్క రోజు కూడా సచివాలయం సిబ్బంది సమయానికి రారని ఎప్పుడు వస్తారో ఎప్పుడు రారో తెలియదని ఎల్ ఎన్ పేట పెద్దకోట 1 సచివాలయంలో అన్ని శాఖలకు సంబంధించిన సిబ్బందిని నియమించాలని గ్రామస్తులు డిప్యూటీ ఎంపీడీవో ముందు మొరపెట్టుకున్నారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీవో జి.వెంకట అప్పలనాయుడుకు వివరణ కోరగా ఇటీవల ఆయన నందిగాం మండలంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పదోన్నతిపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. మండలంలోని 12 సచివాల యాలకు పర్యవేక్షణ బాధ్యతలను చేపట్టనున్నారని తెలిపారు. ఇకనుంచి ఏ ఒక్క సచివాలయ సిబ్బంది కూడా సమయపాలన లేకుండా విధులకు హాజరైతే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

డే అండ్ నైట్ బ్రిడ్జిపై చేపల బజార్

- అసలే ఇరుకు ఆపై రహదారికి గుంతలు
- వంతెనపైనే వాహనాలు ఆపి కొనుగోలు
- ప్రమాదకరంగా మారిన ప్రయాణం

విశాలాంధ్ర-శ్రీకాకుళం: స్థానిక డే అండ్ నైట్ కూడలి వంతెన చేపల బజారుగా మారిందా అనిపిస్తోంది. ఈ వంతెన ప్రారంభంలో ఇరుకుగా ఉంటుంది.. ఆపై ఆ ప్రాంతమంతా గతుకులుమయంగా మారి వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరిగ్గా అక్కడే ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంకాలం సమయాల్లో పెద్ద ఎత్తున చేపల విక్రయాలు జరుగుతుండడంతో కొనుగోలుదారులు తమ వాహనాలను బ్రిడ్జిపైనే ఉంచి కొనుగోలు జరుపుతుంటారు. ఈ కారణంగా ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడే పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు గోతులు, మరోవైపు నిలుపు ఉంచిన వాహనాలు కారణంగా బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగించేందుకు ఈ ప్రాంతం అత్యంత ప్రమాదకరమైంది. ఇటీవల కాలంలో ఇదే డే అండ్ నైట్ కూడలిలో అంబేద్కర్ జంక్షన్ సమీపంలో స్కూటీని బస్సు ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎక్కడ కూడా అటువంటి పరిస్థితులు రాకుండా ట్రాఫిక్ విభాగం అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ తూతూ మంత్రపు చర్యలు తప్ప నివారణకు ఏనాడు దృష్టిసారించిన దాఖలాలు లేవని ప్రయాణికులు వాపోతున్నారు. వంతెనకు అవలి వైపు దత్తాత్రేయ మందిరం వద్ద చేపల విక్రయాలకు అనుకూలమైన ప్రాంతం ఉన్నప్పటికీ వంతెనపైనే చేపల విక్రయాలకు మక్కువ చూపుతున్నారు. ఆ ప్రాంతం నుండి చేపల విక్రయాలను తరలించే ఏర్పాట్లు ట్రాఫిక్ విభాగం సిబ్బంది చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బాధ్యతయుతంగా వ్యవహరించండి

- పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు

విశాలాంధ్ర-మెలియపుట్టి: సామాజిక తనిఖీ సమయంలో అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరు సమన్వయంతో బాధ్యతయుతంగా వ్యవహరించాలని కోసమాల పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు అన్నారు. మెలియాపుట్టి మండల కేంద్రంలో గల స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఏపీవో రవి అధ్యక్షతన మంగళవారం నాడు జరిగిన సామాజిక తనిఖీ సమన్వ సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో సుమారు 27 కోట్ల 70 లక్షల రూపాయలకు సంబంధించిన పనులకు తనికి నిర్వహణ జరుగుతుందని సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ గ్రామాలలో తనిఖీకి వచ్చే వారికి ఆయా దస్త్రాలు పూర్తిస్థాయిలో అందజేయాలన్నారు. పంచాయతీరాజ్, ఐటీడీఏ తదితర శాఖల ద్వారా ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను పరిశీలించి కొలతలు తీసుకొని నివేదిక తయారు చేసుకొని పై స్థాయి అధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, ఉపాధి హామీ పథకం ఏపీడి శైలజ, ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా తదితరులు అనేక అంశాలను మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు ప్రజా ప్రతినిధులు, ఏపీఓ రవి, ఈసీ తార ఆదినారాయణ రెడ్డి, డిఆర్పీలు శివ, రాజు, వెంకటేష్, పోలరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పవర్ ప్లాంట్ ప్రతిపాదన విరమించుకోవాలి

- ఎమ్మెల్యేకు థర్మల్ పవర్ ప్లాంట్ పోరాట కమిటీ హెచ్చరిక

విశాలాంధ్ర-ఆమదాలవలస: థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణం చేపడతామని ఏపీ జెన్కో అధికారులతో కలిసి ఎమ్మెల్యే కున రవికుమార్ ప్రతిపాదన చేసిన దాన్ని తక్షణం ఉపసంహరించు కోకపోతే ప్రతిఘటన తప్పదని థర్మల్ పవర్ ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ వాభయోగి, సీపీఐ జిల్లా నాయకులు చావర వెంకట్రావు, థర్మల్ పవర్ ప్లాంట్ పోరాట కమిటీ అధ్యక్షుడు సురేష్ దొర, కార్యదర్శి సవర సింహాచలం, కోశాధికారి అత్తులూరి రవికాంత్‌లు హెచ్చరించారు. ఆముదాలవలసలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో విలేకరులతో మాట్లాడుతూ ఉద్యమాల పట్ల చులకన భావంతో చూస్తూ ఎమ్మెల్యే మాట్లాడటం తగదన్నారు. ఇక్కడ పవర్ ప్లాంట్ నిర్మించవద్దని పవర్ ప్లాంట్ పేరుతో మా బతుకులు బుగ్గి పాలు చేయొద్దని పోరాడుతుంటే ఎవరో కొంతమంది అవగాహన లేని వాళ్ళు ఇక్కడ మాట్లాడుతున్నారని కూన రవికుమార్ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఆదివారం పవర్ ప్లాంట్ పేరుతో ఆదివాని గ్రామాలకు వెళ్తే ఆదివాసీలంతా పెన్షన్ తీసుకోవడానికి కూడా నిరాకరించారన్నారు. ఆదివాసీలు పెద్ద ఎత్తున నినాదాలు చేసి మా గ్రామాలకు రావద్దు అని ఫ్లెక్సీ బోర్డులు కట్టారన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించి పవర్ ప్లాంట్ ప్రతిపాదన విరమించాలని ఇంకా ముందుకెళ్తే రాజకీయంగా ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని స్పష్టం చేశారు. వెన్నెల వలస నుండి సరుబుజ్జిలి, బూర్జ మండలం సరుబుజ్జిలి మండలాల పరిధిలో వెన్నెల వలస రిజర్వాయర్, బొమ్మిక రిజర్వాయర్ వర్షాధారంతో పదివేల ఎకరాలు పంట భూములు ఈ పవర్ ప్లాంట్ వల్ల నాశనమవుతాయన్నారు. ఎమ్మెల్యే దురుద్దేశంతోనే పోలీసు బలగాలతో అక్కడికి చేరుకొని ఉద్యమకారులపై తప్పుగా మాట్లాడటం తగదన్నారు. తక్షణమే ప్రతిపాదన విరమించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ (ఐఫ్) జిల్లా అధ్యక్షులు బొత్స సంతు, మోహనరావు, సిపిఎం జిల్లా కార్య వర్గ సభ్యులు సవర లక్ష్మణరావు, సవర పోరాట కమిటీ సభ్యులు కువ్వారి, సవర మనోజ్, పోరాట కమిటీ సభ్యులు సవర నగేష్, సవర సింగయ్య పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ సభ్యుల ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-కవిటీ: కవిటి మండలం గొండ్యాల పుట్టుగ గ్రామానికి చెందిన రమేష్ ఒరిస్సాలో రోడ్డు ప్రమాదంలో ఇటీవల ప్రాణాలు కోల్పోవడంతో ఎస్జీఎఫ్ సభ్యులు మంగళవారం రూ.20,500 వేలు మృతుని భార్య మోహినికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరింత మంది దాతలు యువజన సంఘా సభ్యులు ముందుకు వచ్చి ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్జిఎఫ్ సభ్యులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జర్జన ప్రవీణ్‌కు ఘన సత్కారం

విశాలాంధ్ర - హిరమండలం/పాతపట్నం: భారత రాజ్యాంగ దినోత్సవంను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేస్ నేతృత్వంలో నిర్వహించిన విద్యార్థుల మాక్ అసెంబ్లీలో పాతపట్నం నియోజకవర్గం హిరమండలం మండలం గులుమూరు గ్రామానికి చెందిన గులుమూరు జిల్లా పరిషత్ హై స్కూలులో 9వ తరగతి విద్యార్థి జర్జన ప్రవీణ్ కుమార్ రాష్ట్ర స్థాయి ఎంపికలో చోటు దక్కించుకుని ప్రత్యేకంగా మెరిశాడు. ఈ సందర్భంగా పాతపట్నం టీడీపీ కార్యాలయంలో విద్యార్థి జర్జన ప్రవీణ్ కుమార్‌ను స్వయంగా నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు మంగళవారం సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారి కిలారి రాంబాబు, విద్యార్థి తల్లిదండ్రులు, ఎన్డీఏ కూటమి నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల శాఖ నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-కవిటీ: యూటీఎఫ్ కవిటి మండల శాఖ నూతన కమిటీలను ఎన్నిక కవిటిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు మంగళవారం యుటిఎఫ్ కవిటి మండల శాఖ మహాసభలు స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో జి.జానకిరావు అధ్యక్షతన యుటిఎఫ్ సీనియర్ నాయకులు కుర్రాయి రామారావు, జుదిష్టి రౌలో, మామిడి.శ్రీను సమక్షంలో నిర్వహించారు. ఈ ఎన్నికకు ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి ఎం.మురళిప్రకాష్, ఎన్నికల పరిశీలకులుగా జిల్లా అధ్యక్షులు లండ బాబురావు వ్యవహరించారు. గౌరవ అధ్యక్షులుగా మామిడి శ్రీను, అధ్యక్షులుగా నారద కామేష్, ప్రధాన కార్యదర్శిగా సూర్యం, సహాధ్యక్షులుగా ఏ.వి రమణ, సహాధ్యక్షులు ఎస్.సుజాత, కోశాధికారిగా శ్రీధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నిక అనంతరం సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి అచ్చెన్న

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: సంతబొమ్మాళి మండలంలోని తాళ్లవలస గ్రామంలో వెలుగులోకి వచ్చిన డయేరియా బాధిత కుటుంబాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్వయంగా పరామర్శిం చారు. మంగళవారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా అధికారులు,ఇతర శాఖల అధికారులు గ్రామానికి చేరుకుని అక్కడి పరిస్థితిని సమగ్రంగా పరిశీలించిన ఆయన, ప్రజలకు భరోసానిస్తూ అవసరమైన అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. ఈసందర్భంగా అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. తక్షణమే డయేరియాకు గల కారణాలను ఖచ్చితంగా నిర్ధారించాలని, వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించారు. గ్రామంలో తాగునీటి నాణ్యతను శాస్త్రీయంగా విశ్లేషించాలని, విశాఖపట్నం పంపాలని సూచించారు. సమీప గ్రామాల పరిస్థితిపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రతి కుటుంబానికీ సురక్షిత తాగునీరు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు దీనికోసం రూ 60 లక్షలు తక్షణంగా మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలియజేశారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులను పరిస్థితులపై అడిగి తెలుకున్నారు. వృద్ధుడు మృతికి గల కారణాలు కుటుంబ సభ్యులకు అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ అనిత, ఆర్డీవో కృష్ణమూర్తి, సంతబొమ్మాళి మండల రెవెన్యూ అధికారి హేమ సుందర్ రావు, డిప్యూటీ ఎంపీడీవో దుంపల శ్రీనివాసరావు, తాళ్లవలస పంచాయతీ సర్పంచ్ గున్న జానకి ప్రభాకరరావు, దండుగోపాలపురం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ విశ్వనాథ్ రంగనాథ్, మండలం పిఎసిఎస్ కూచెట్టి కాంతారావు, మాజీ పిఎసిఎస్ చైర్మన్ ఏ. రాంప్రసాదరావు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు పంగ అసిరి నాయుడు, తెలుగు దేశం పార్టీ యువత అధ్యక్షుడు కూశెట్టి భాను ప్రకాష్, టిడిపి ముఖ్య నాయకులు ప్రగడ గోపాల్ పాల్గొన్నారు.

ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తాం

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-టెక్కలి: మండలంలోని స్థానిక జై కృష్ణాపురం గ్రామంలో ఉన్న దాలి చెరువు ముంపు వలన సుమారు 100 ఎకరాల పంట పొలాలు ముంపునకు గురై దెబ్బతింటున్నాయని బిజెపి నాయకులు దృష్టికి గ్రామస్తులు తీసుకువచ్చారు. అయితే ఇటీవల బిజెపి టెక్కలి నియోజకవర్గ ఇన్చార్జ్ అట్టాడ రవి బాబ్జి ఆ గ్రామాన్ని పరిశీలించి, రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సమస్యపై బిజెపి నాయకులు బుధవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి జై కృష్ణాపురం రైతుల సమస్యల గురించి తెలిపారు. వర్షాలు, తుఫాన్ ప్రభావాలు వచ్చే సమయాలలో దాలిచెరువు వలన ఎప్పుడు ఎలాంటి ముంపు వస్తుందో తెలియక రైతులు భయాందోళన చెందుతున్నారని వివరించారు. వెంటనే మంత్రి అచ్చన్న సంబంధిత అధికారులకు ఫోన్ చేసి రైతు సమస్యలపై పరిశీలించి, సమగ్ర నివేదిక వెంటనే తనకు తెలియజేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమస్యపై త్వరలోనే పరిశీలించి రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కిషన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అన్నెపు ఉమామహేశ్వరరావు, బూరి నరేంద్ర చక్రవర్తి, ధూపాన రాజ్ కుమార్ రెడ్డి, మండల అధ్యక్షులు జర్జన రాంజీ, రైతులు తమ్మినేని ఆనందరావు, కణితి ఇందిరమ్మ, బమ్మిడి నాగమ్మ, పేడాడ వనజాక్షి, గురువెల్లి చిలకమ్మా, మెట్ట సీతమ్మ, బమ్మిడి సోమేశ్వరరావు, పేడాడ లచ్చయ్య, బెండి బాబురావు, వీరఘట్టపు పాల్గుణ రావు, కణితి మల్లేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో వర్సిటీ పేరును ఇనుమడింపజేయాలి

విశాలాంధ్ర - ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీని జాతీయ స్థాయిలో పేరును ఇనుమడింపజేసేలా కృషిచేయాలని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. రాజస్థాన్లోని బికనీర్లో నిర్వహించిన ఖేల్ ఇండియా జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో వర్సిటీ తరపున పాల్గొని కాంస్య పతకంను సాధించిన గుజ్జల వర్షితను ఆమె మంగళవారం అభినందించారు. ఈ సం దర్భంగా మాట్లాడుతూ భవిష్యత్లో జరిగే పోటీల్లో కూడా మరింత ప్రగతి సాధించాలన్నారు. వర్షితను స్ఫూర్తిగా తీసుకుని క్రీడాకారులు మరింత రాణించాలన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, స్పోర్ట్స్ డీన్ డాక్టర్ పి.రవికుమార్, పీడీలు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.భాస్కర్ తదితరులు వర్షితను అభినందించారు.

గ్రిగ్స్ మీట్‌లో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-రణస్థలం: మండల స్థాయిలో నిర్వహించిన గ్రిగ్స్ మీట్ క్రీడా పోటీలను కొవ్వాడ మత్స్యలేశం గ్రామంలో నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రీ నారాయణ స్కూల్ విద్యార్థులు చురుకుగా పాల్గొని తమ ప్రతిభను గర్వంగా ప్రదర్శించారు. వివిధ క్రీడా విభాగాల్లో పోటీ పడి అద్భుత ప్రతిభ చూపిన మా విద్యార్థులు పాఠశాల విజయ కిరీటంలో మరో రత్నాన్ని జోడించారు. వాలీబాల్ పోటీలో 3వ బహుమతిని సాధించిన ఎ. రాజ్ కుమార్, ఎ.రాము, ఎం. రిషి, పి. జయంత్, ఎన్. చైతన్య, ఎ.రాముడు, ఎం.ప్రసా ద్‌లను అభినందించారు. బ్యాడ్మింటన్ పోటీలో 2వ బహుమతిని సాధించిన ఎ. రాజ్ కుమార్, ఎ. రాముడును కూడా అభినందించారు. ఈ విజయాలను పురస్కరించుకుని పాఠశాల డైరెక్టర్ కెల్ల మంజు భార్గవి, కరస్పాండెంట్ కెల్ల గోవింద, ప్రిన్సిపల్ గౌరునాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు.

చావుపై కూడా వసూళ్లు

ఇది రెవెన్యూ అధికారుల దందా

విశాలాంధ్ర-నందిగాం: ఇటీవల పలాస వెంకటేశ్వర స్వామి సన్నిధిలో జరిగిన ఘటనలో పలువురు మృతిచెందగా నందిగాం మండలానికి చెందిన రమణమ్మ మృతి చెందారు. దీనికి సంబంధించి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం ఎమ్మార్వో ఆఫీస్‌కి సదరు కుటుంబ సభ్యులు వెళ్తే రెవెన్యూ అధికారులు డబ్బులు వసూలు చేయడంపై గ్రామస్తుల్ని, పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఇదేంటి శవాలపైన కూడా డబ్బులు వసూలు చేసే దుస్థితికి రెవిన్యూ వ్యవస్థ దిగజారిపోయిందా అని పలువురు నిర్ఘాంత పోయారు. నందిగాంలో రెవెన్యూ అధికారులు లంచం లేనిదే పని అవ్వదని వచ్చిన ప్రజలకి ముఖం మీద చెబుతున్నారని కొంతమంది విమర్శిస్తున్నారు. అయితే ఇదిలా ఉండగా మండలంలో వీఆర్వోలు పొజిషన్ సర్టిఫికెట్స్ కోసం ఒక రైతు దగ్గర కొంతమొత్తంలో వసూళ్లకు పాల్పడ్డారని తెలుస్తోంది. ఈ విషయంపై తహసిల్దార్‌ని వివరణ అడగగా వాస్తవాలను తెలుసుకుని తగు చర్యలు తీసుకుంటానని తెలియజేశారు.

ఆక్రమణలపై తూతూ మంత్రంగా సర్వేలు

- ప్రభుత్వ స్కూల్ స్థలం ఎంత ఉందో పూర్తిగా నిర్ధారణకు రాలేని అధికారులు
- ఆక్రమణదారులకు రాజకీయ నాయకుల అండ
- బడా బాబు కనుసైగలో స్కూలు స్థలం ఆక్రమణ
- ఫిర్యాదులు ఇచ్చి నెలలు గడుస్తున్నా స్పందించని అధికారులు

విశాలాంధ్ర-టెక్కలి: మండలంలోని స్థానిక ఎన్టీఆర్ నగర్ 8వ వీధిలో ఉన్న ఎంపీపీ స్కూల్ స్థలంపై ఉన్నత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు ఇచ్చినప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదని, రెవెన్యూ సిబ్బంది తూతూ మంత్రంగా సర్వే చేసి వెళ్ళిపోతున్నారని బిజెపి నాయకులు వాపోతున్నారు. అసలు పాఠశాల స్థలం పూర్తిగా ఎంత స్థలం ఉందో అధికారులు నిర్ధారించలేకపోతున్నారని, ఇటీవల మండల విద్యాశాఖ అధికారులకు పిలిపించి మాట్లాడుతూ స్కూల్ స్థలం ఆక్రమాన జరిగిన చుట్టుపక్కల స్థలాలపై నోటీసులు జారీ చేస్తామని చెప్పి, అక్కడతో ఈ సమస్యను సద్దుమణిగించి చేతులెత్తేసారని, ఇప్పుడు మరలా సర్వేలు అంటూ చేసుకొని వెళ్ళిపోతూ కాలం గడుపుతున్నారని అంటున్నారు. స్కూల్ స్థలం ఆక్రమించిన చుట్టుపక్కల ఆక్రమణ దారులకు రాజకీయ అండ ఉందని, అందుకే ఈ సమస్య పరిష్కరించలేకపోతున్నారని, బడా బాబుల కను సైగుల్లో స్కూల్ స్థలం ఆక్రమణలు జరిగాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ స్థలం, ప్రభుత్వ స్కూలు స్థలం ప్రభుత్వ అధికారులే అప్పజెప్పలేక పోతున్నారని, ఎన్నిసార్లు ఈ సమస్యపై ఫిర్యాదులు చేసినప్పటికీ కొన్ని నెలలు గడుస్తున్న అధికారుల స్పందన లేని పరిస్థితి కనబడుతుందని అంటున్నారు. స్కూల్ స్థలంలో వీధి ప్రజలకు రహదారి ఇస్తే స్కూల్ స్థలం మొత్తం కనుమరుగవుతుందని, స్కూల్లో చదువుతున్న విద్యార్థులు ఆటలకు దూరమవుతాయని, దీనిపై ఉన్నత అధికారులు, రాష్ట్ర నాయకులు సామగ్ర దర్యాప్తు జరిపి విద్యార్థులకు పాఠశాల స్థలంని అప్పగించి న్యాయం చేయాలని కోరుకుంటున్నారు. పాఠశాల స్థలం పాఠశాలకు ఇచ్చేవరకు ఈ సమస్యపై పోరాడుతామని బిజెపి నాయకులు బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ జన్ని పరమేశ్వరరావు, స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ లింగరాజు చిట్టిబారికి, జిల్లాఎస్టీ మోర్చ ప్రధాన కార్యదర్శి రంకిడి నీలయ్య విద్యార్థులకు హామీ ఇచ్చారు. దీనిపై మంగళవారం రెవెన్యూ సిబ్బంది పూర్తి సర్వే చేపట్టారని త్వరలోనే ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపినట్లు బిజెపి నాయకులు, స్కూల్ సిబ్బంది తదితరులు తెలియజేశారు.

పిఎసియస్ చైర్మన్ ను కలిసిన తెలుగు యువత బృందం

విశాలాంధ్ర- సంతబొమ్మాళి: సంతబొమ్మాళి మండల ప్రాధమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పిఎసియస్) అధ్యక్షులుగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కూచెట్టి కాంతారావు ను, మండల తెలుగుయువత బృందం మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ని పూలమాలలు దుస్సాలువతో సన్మానించారు. అతని నాయకత్వంలో సొసైటీ మరింత పారదర్శకతతో, రైతులకు ప్రజలకు చేరువగా పనిచేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి మండలం తెలుగుయువత అధ్యక్షుడు కూచెట్టి భానుప్రకాష్, ప్రధానకార్యదర్శి ఎన్ని గౌరునాయుడు, ఉపాధ్యక్షులు సూరాడ రాయుడు, సార లక్ష్మణరావు, కార్యదర్శులు చింతాడ భీమారావు (కోటబొమ్మాళి ఏఎంసి డైరెక్టర్), ధర్మాన అచ్చుతరావు, బై తులసీదాసు, ధీర్ఘాశి జయరాం, కింజరాపు యువదళం అధ్యక్షుడు డొక్కరి చలపతిరావు చోడిపిల్లి చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటాలు వద్దు

-విద్య వైద్యం నిర్వహణ ప్రభుత్వ బాధ్యత

- రాష్ట్ర చరిత్రలోనే భారీగా ఫీజులు బకాయిలు పెట్టిన కూటమి ప్రభుత్వం

- బకాయిలు పడ్డ నిధులను తక్షణమే చెల్లించేలా సీఎం చొరవ చూపాలి

విశాలాంధ్ర-ఆమదాలవలస: విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం భరోసా కల్పించాలని అందుకు తగిన ఫీజు రీఎంబర్స్మెంట్ బకాయిల ను తక్షణమే వారికి భరోసా అందించాలని మాజీ స్పీకర్, వైసీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ సమన్వయకర్త తమ్మినేని సీతారాం అన్నారు. మంగళవారం తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తం గా ఉన్నత విద్య రంగం గందరగోళంలో చిక్కుకుపోయే పరిస్థితులు ఏర్పడ్డాయని, ఫీజు రీయింబర్స్మెంట్ విషయంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం తీవ్ర నిరాశను కలిగిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో లక్షలాది మంది విద్యా ర్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతోందని తీవ్రంగా విమర్శించారు. తమ్మినేని మాట్లాడుతూ, చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్ప టి వరకు ఎనిమిది క్వార్టర్లకు గాను సుమారు రూ. 7,800 కోట్లు కాలేజీలకు బకాయిలుగా పెండిం గ్లో ఉంచారు. ఎన్నికల సమయంలో నేరుగా కాలేజీలకు ఆరు నెలలకు ఒకసారి చెల్లిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు మొండి చేయి చూపుతున్నారని మండి పడ్డారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయక పోవ డంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయని, అనేక చోట్ల ఫీజులు కట్టకపోతే సర్టి ఫికెట్లు ఇవ్వడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులు రీయింబర్స్మెంట్కు అర్హత ఉన్నా బకాయిల కారణంగా కళాశాలలు ఫీజులు కట్టాలని ఒత్తిడి చేయడం వల్ల చాలామంది అప్పులు తీసుకోలేక చదువును మధ్యలోనే వదిలేస్తున్నారని చెప్పారు. వైయస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్మెంట్ పథకానికి జగన్మోహన్ రెడ్డి హయాంలో పునర్జీవం లభించగా, ఇప్పుడు చంద్ర బాబు సర్కారు ఆ పథకాన్ని అడుగంట బెట్టింద న్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యాదీవెన కింద రూ.12,609 కోట్లు క్రమం తప్పకుండా త్రైమాసి కాల వారీగా చెల్లించడమే కాక, గత టీడిపి ప్రభుత్వ పు రూ.1,778 కోట్ల బకాయిలను కూడా తీర్చారని ఆయన గుర్తు చేశారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో విద్యాదీవెన, వసతిదీవెన పథకాల కింద మొత్తం రూ.18,663 కోట్లు ఖర్చు చేసి విద్యార్థులకు పూర్తి భరోసా కల్పించారని తమ్మినేని వివరించారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా విద్యార్థుల చదు వుకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసిన ప్రభుత్వమే అది అని అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో పాఠశాలల నుండి ఉన్న తవిద్య వరకు మొత్తం వ్యవస్థ కుదేలైంది. ఫీజులు బకాయిలుగా పెడుతూ, విద్యను ప్రైవేటు కాలేజీల చేతిలో బండబాతులా వదిలేశారు. ఎన్నడూ లేని విధంగా ప్రైవేటు కాలేజీలు 'మేము నడపలేము' అంటూ రోడ్డెక్కే పరిస్థితివచ్చిందని వ్యాఖ్యానించారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటం మానుకోండి అని హి తువు పలికారు. వెంటనే రూ.7,800 కోట్లు విడుదల చేసి ఫీజు రీయింబర్స్ మెంట్‌ను పూర్వపక్షంగా అమలు చేయాలి. ఆలస్యం ప్రతి విద్యార్థి జీవితానికి నష్టం కలుగుతోందని విద్య, వైద్యం నిర్వహణ ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేశారు.

తాళ్లవలస లో తాగునీరు వల్ల డయేరియా రాలేదు కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర- సంతబొమ్మాళి: సంతబొమ్మాళి మండలం తాళ్లవలస గ్రామం లో ప్రభలిన డయేరియా త్రాగునీటి వల్ల రాలేదని తినే ఆహారం ఇన్ డైజేషన్ వల్ల వాంతులు విరోచనాలు అయ్యాయని జిల్లా కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్ అన్నారు. మంత్రి కింజరాపు అచ్చేనాయుడు తో కలసి గ్రామం లో పర్యవేక్షించిన కలెక్టర్ అనంతరం ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులు తో మాట్లాడుతూ, ఇళ్లలో నీటిని నిల్వ ఉంచకూడదని తెలిపారు. వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని అన్నారు. వ్యవసాయ పొలాల మధ్య ఉన్న వాటర్ ట్యాంక్ ను, మురికి నీరు చెరువులో కలిసే ప్రదేశాన్ని పరిశీలించారు. మురికి నీరు చెరువులో కలవకుండా డ్రైనేజీ ద్వారా మళ్ళించడానికి 15 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఎస్సీ వీధిలో కలెక్టర్ సందర్శించి పారిశుధ్యం మెరుగుపరచాలని పంచాయతీ అధికారులకు ఆదేశించారు. మెడికల్ క్యాంప్ ఇంకా కొనసాగించాలని వైద్యాధికారులకు కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ ఇంటింటికి వెళ్లి గ్రామస్తులు తాగుతున్న నీటిని పరీక్షలు చేసి గ్రామస్థులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య, టెక్కలి ఆర్డిఓ కృష్ణమూర్తి, డిఎం అండ్ హెచ్ ఓ కె. అనిత, తహసీల్దార్ హేమ సుందర్ రావు ,ఇన్చార్జి ఎంపిడిఓ దుంప శ్రీనివాసరావు, స్థానిక పీహెచ్సీ విశ్వనాథ్ గంగాధర్ తదితరులు ఉన్నారు.

మార్పు కోసం మహిళలు ముందడుగు

ఏపీఎం పైడి కూర్మారావు

విశాలాంధ్ర-మందస: వికసిత గ్రామీణ భారత్ దిశగా సమ్మిళిత వృద్ధికి ,ఆర్థిక సాధికారతకు మహిళలే ముందడుగు వేస్తూ, గ్రామాలలో మహిళా సంఘాలకు జెండర్ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా క్రియాశీల అవగాహన కల్పించాలని వెలుగు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు పిలుపునిచ్చారు. మంగళవారం మందస ప్రధాన కేంద్రంలో గల సచివాలయ ఆవరణలో జండర్ ర్యాలీ చేపట్టి అవగాహన కల్పించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న హ్యూమన్ డెవలప్మెంట్ యాక్టివిటీస్ లో భాగంగా మహిళా సంఘాల సభ్యులు పూర్తి అవగాహనతో హింసకు తావులేని కుటుంబాలు మరియు జండర్ ఈక్విటీ సమాజం దిశగా పయనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు రమణమ్మ, శారద సైలజ ల తోపాటు అందరూ క్లస్టర్ కోఆర్డినేటర్లు, వి.వో.ఏ.లు, గ్రామ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ నిధులతో ప్రజలు ఆరోగ్యానికి భరోసా

విశాలాంధ్ర- సంతబొమ్మాళి: సీఎం రిలీఫ్ ఫండ్ నిదులతో ప్రజల ఆరోగ్యానికిభరోసా చేకూరుతుందని సంతబొమ్మాళి మండలం మరువాడ పంచాయతీ సర్పంచ్ సూరాడ ధనలక్ష్మిదాసురాజు మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. డి. మరువాడ గ్రామానికి చెందిన కళావతమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నందున రూ లక్ష73వేలు చెక్కును మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అందజేసారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘం అధ్యక్షుడు లోకేష్, లక్కీవలస పంచాయతీ సీనియర్ టిడిపి నాయకులు పిట్టరాజులు ఉన్నారు.

అబద్ధపు ఆరోపణలు పెద్దరికాన్ని మంటగలుపుతున్నాయి

విశాలాంధ్ర-ఆమదాలవలస: తాడివలస ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులపై వీరి అనుచరగణం పెట్టిన తప్పుడు ఫిర్యాదు పై డిటి ఎఫ్ శ్రీకాకుళం జిల్లా శాఖ పక్షాన మేము ఇచ్చిన ఖండనకు ఆ గ్రామ సర్పంచ్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ అబద్దాలతో ఆరోపణలను మరల గుప్పించడాన్ని డి టి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు, జిల్లా గౌరవాధ్యక్షులు కోత ధర్మారావు ఖండించారు. ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు బల్లకంటయ్య తాడివలస ఉన్నత పాఠశాలకు రాకముందు జరిగిన చెట్లు అమ్మ కం, ఆయనకు ఎటువంటి సంబంధం లేదని వీరికి తెలిసినప్పటికీ, అనైతికంగా హెచ్ఎం పైన ఫిర్యాదు చేయించడం సర్పంచ్, ఈమె భర్త దిగజారుడుతనా నికి నిదర్శనం అని ఆ ప్రకటనలో తెలిపారు. ఇక ఆ చెట్లు, ఇనుప గేటు అమ్మినవారు గతంలో పనిచేసిన ఆ గ్రామానికి చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు మెట్ట అనంతభట్లు, ప్రస్తుతం ఆ పాఠశాల లో పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయు డు పెంటయ్యఅని వీరికి తెలిసినప్పటికీ, వారి మీద ఫిర్యాదు చేయకుండా ప్రధానోపాధ్యాయునిపై కక్ష సాధింపుతో ఈ ఫిర్యాదు చేయడం అనైతికమని భావిస్తున్నాం అని తెలిపా రు.పాఠశాల ఆవరణలోనే దాతలు ఇచ్చిన సొమ్ముతో తమ ఇంటికి గేట్లు చేయించుకున్న ఆంగ్ల ఉపాధ్యా యుడు తమ వర్గానికి చెందిన వారు కావడంతో వెనకేసుకుని రావడం హాస్యాస్పదం అని పేర్కొన్నారు. ఇక్కడ వీరు సాంకేతిక అంశాలను కారణాలుగా చూపి స్తూ అనైతికంగా ప్రవర్తిస్తున్నారు అని వివరించారు. ఇక డి టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరి ప్రసన్న తాడివలస ఉన్నత పాఠశాలలో పనిచేసిన కాలము లో వీరు ఆరోపిస్తున్నట్లుగా తప్పులు జరిగి వుంటే, ఆయన ఉన్నప్పుడు ఫిర్యాదు చేయకుండా ఆయన ఆ పాఠశాల నుండి రిలీవ్ కాబడిన ఆరు నెలల కాలం తర్వాత ఇప్పుడు తప్పుడు ఆరోపణలు చేయడం వీరి యొక్క రాజకీయ దురుద్దేశం బయటపడుతుం ది. ఆ పాఠశాల ఫేర్వెల్ సందర్భంగా విద్యార్థుల వద్ద నుంచి ఒక్కొక్కరి దగ్గర 500 రూపాయలు ఆ గ్రామా నికి చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు మెట్ట అనంతభ ట్లు వసూలు చేసి ఖర్చు పెట్టగా, ఇప్పుడు హరిప్రస న్నపై వీరు తప్పుడు ఆరోపణలు చేయడం విడ్డూ రంగా ఉంది. ఆయన ఫోన్ పే ద్వారా చేసిన చెల్లింపు లు పరిశీలన చేస్తే వాస్తవం బయటపడుతుందని అన్నారు. 2014 నుంచి ఇప్పటివరకు ఈ ఉన్నత పాఠశాలలో పనిచేసిన, పనిచేస్తున్న ప్రధానోపాధ్యా యులను ఏ విధంగా వీరి పార్టీకి చెందిన వారు ఎన్ని ఇబ్బందులకు గురిచేశారో జిల్లాలో గల ఉపాధ్యాయ లోకానికి తెలుసు అన్నారు. ఇక ఈ పెద్ద మనుషుల దౌర్జన్యాల గురించి, డిటిఎఫ్ నాయకుల నిబద్ధత గురించి ఈ ప్రాంత ప్రజలకు, ఉపాధ్యాయ లోకానికి బాగా తెలుసు. ఇక వీరు నైతిక విలువల గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంటుంది. ఇటువంటి తప్పుడు ఆరోపణలు చేస్తూ వీళ్ళ పెద్దరికాన్ని మంట కలుపుతున్నారు.ఇకనైనా వీరు నీతి, నిజాయితీగల ఉపాధ్యాయులపై తప్పుడు ఫిర్యాదులను మానుకొని, తాడివలస ఉన్నత పాఠ శాల విద్యాభివృద్ధికి కృషి చేస్తారని విజ్ఞప్తి చేస్తున్నాం.

ఏఐసిసి ఓబిసి విభాగపు జాతీయ కోఆర్డినేటర్ గా డా.జీవితేశ్వరరావు

విశాలాంధ్ర-పలాస: అఖిలభారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసిసి) ఓబీసీ విభాగపు జాతీయ కోఆర్డినేటర్ గా కాశీ బుగ్గకు చెందిన ప్రముఖ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ జీవితేశ్వర రావును పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు మంగళవారం ఓబీసీ చైర్మన్ అనిల్ జైహింద్, పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ కేసి వేణుగోపాల్ నుండి ఉత్తర్వులను అందుకున్నారు. ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సిఫార్సుల మేరకే నియామకం జరిగిందని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జీవితేశ్వర రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన కార్యకర్తలకు సముచిత స్థానం అధిష్టానం కల్పిస్తారనడానికి తన నియామకమే ఉదాహరణ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో పని చేయడం అదృష్టమని, కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం కలిగి ఉండడం భారతదేశ పౌరుషత్వం కలిగి ఉన్నట్లేనని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు కాంగ్రెస్ పార్టీతోనే ముడిపడి ఉందని అన్నారు. భారతదేశ లౌకికతత్వానికి, భారత రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉన్న ప్రస్తుత తరుణంలో కాంగ్రెస్ పార్టీ పాలన ఈ దేశానికి అత్యవసరమని అన్నారు. వెనుకకు నెట్టబడిన శ్రీకాకుళం జిల్లా కు చెందిన తనను గుర్తించి జాతీయ స్థాయిలో సముచిత స్థానం కల్పించినందుకు గాను కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ఈ సందర్భంగా అయన కృతజ్ఞతలు తెలిపారు.కాగా డా. జీవితేశ్వర రావును జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పూడి కిరణ్ కుమార్ కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో నందీప్, సాయికుమార్ పాల్గొన్నారు.

నిరుద్యోగ అభ్యర్థులకు పోటీ పరీక్షలు

విశాలాంధ్ర-మందస: ప్రభుత్వంఆధ్వర్యంలో జరుగుతున్న కౌశలం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మందస మేజర్ పంచాయతీ పరిధి లో ఉన్న సచివాలయంలో వివిధ కంపెనీల ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ అభ్యర్థులకు ఆన్లైన్ పరీక్షలు జరిగాయి మందస పంచాయతీ కార్యదర్శి బమ్మిడి నవీన్ కుమార్ పర్యవేక్షణలో ఈ పరీక్షలు జరిగాయి ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులందరికీ విడతల వారీగా పరీక్షలు జరుగుతాయని దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులందరికీ సమాచారం ఇవ్వడం జరిగిందని పంచాయతీ కార్యదర్శి బమ్మిడి నవీన్ కుమార్ తెలిపారు.

ఆర్డీవో గారు తప్పుడు ప్రకటన చేయవద్దు

విశాలాంధ్ర-పలాస: ఉద్దానం ప్రాంతంలో కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి సంబంధించి భూముల సేకరణ విషయమై ప్రజాభిప్రాయం తీసుకుంటామన్న ఆర్డీవో ప్రకటన హాస్యస్పదంగా ఉందని కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు, కార్యదర్శి జోగి అప్పారావులు అన్నారు. మంగళవారం బాధిత ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందస వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో కార్గో ఎయిర్పోర్ట్ ప్రభావిత గ్రామాల్లో ఆర్డీవో,డిఆర్ఓ లు పర్యటించే సమయంలో అక్కడున్న రైతాంగం ముక్తకంఠంతో కార్గో ఎయిర్ పోర్ట్ కు సెంటు భూమి కూడా ఇవ్వమని వారి ముందే స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు. అయినా ఆర్డీవో , డిఆర్ఓ సోమవారం మందస తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి రైతులకు నచ్చ చెప్తామని ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నామని ప్రజాభిప్రాయ సేకరణ చేసి ముందుకు వెళ్తామని ప్రకటించడం హాస్యస్పదంగా ఉందని అన్నారు. రాంపురం బిడిమి గంగువాడ అనకాపల్లి సంతోష్ నగర్ గ్రామాల్లో రైతులు తమ భూములు కార్గో ఏర్పాటుకు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు.పోలీసు నిర్బంధాలు పెట్టి అధికారులు పర్యటించినప్పుడు కూడా రైతులందరూ స్పష్టం చేశారన్నారు. అంతే కాకుండా ఈ ప్రభావిత గ్రామాల నుండి వందలాది మంది పలాస ఆర్డిఓ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం ఇచ్చేందుకు అనుమతులు పెట్టుకున్నప్పుడు కూడా అనుమతులు మంజూరు చేయకుండా పోలీసు నిర్బంధాలు పెట్టి వామపక్ష నాయకుల అరెస్టులు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దయచేసి ఇలాంటి ప్రకటనలు చేయకుండా ప్రభుత్వానికి కార్గో ఎయిర్ పోర్ట్ కు రైతాంగం వ్యతిరేకిస్తున్నారని స్పష్టం చేశారు.

నాసిరకంగా రోడ్డు నిర్మాణం పనులు

నాణ్యత లోపంతో ఆందోళనలో గిరిజనులు

విశాలాంధ్ర-మందస: మండలం కొండలోగాం గిరిజన గ్రామం నుంచి దేవుపురం గ్రామం వరకు నిర్మిస్తున్న తారు రోడ్డు నిర్మాణం పనులపై గిరిజనులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా నిర్మిస్తున్న ఈ రోడ్డు పనులు నిబంధనలకు భిన్నంగా జరుగుతున్నాయని రోడ్డు పనుల్లో నాణ్యత లోపం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ సంబంధిత ఇంజనీరింగ్ విభాగం అధికారులు కుమ్మక్కై రోడ్డు పనుల్లో నాణ్యత లేకుండా చేస్తున్నారని వారు తెలుపుతున్నారు. తారు రోడ్డు పనులు నిబంధన ప్రకారం జరగకపోతే పనులను నిలిపివేయాలని గిరిజన సంఘం నాయకులు నరసింగ రావు సవర హరికృష్ణ సవర శాంతారావు సవర జగ్గారావు తదితరులు డిమాండ్ చేశారు. తారు రోడ్డు పనులు సక్రమంగా జరగకపోతే రోడ్డు పనులను అడ్డుకుంటామని వారు హెచ్చరించారు.

హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత తగదు

లయన్ డా.సింధూర

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం లయన్స్ క్లబ్ సెంట్రల్ ఆధ్వర్యంలో హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమాన్ని సింధూర వైద్యశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ హెచ్ఐవి స్థితిని తెలుసుకోవాలని, హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపించరాదని, యువత వ్యసనాలకు బానిస కారాదన్నారు. లయన్స్ ప్రతినిది డాక్టర్ శ్రావ్య మాట్లాడుతూ వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే చికిత్స చేసుకో వాలని, చెడు సావాసాలకు యువత దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి టెక్కం రామ గోపాల్, లయన్స్ ఉపాధ్యక్షులు భోగెల ఉమా మహేశ్వరరావు, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, వైద్యశాల వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మూలపేట పోర్టు వాహనాలను అడ్డుకున్న గ్రామస్తులు

విశాలాంధ్ర -సంతబొమ్మాళి: సంతబొమ్మాలి మండలం కూర్మనాధపురం గ్రామం వద్ద మూలపేట పోర్టు వాహనదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతోవాహనాలను గ్రామస్తులు మంగళవారం అడ్డుకున్నారు. మెయింటెనెన్స్ కోసం పోర్టు ట్రిప్పర్ రోడ్డు పక్కన పార్కింగ్ చేశారు. మెయింటినెన్స్ పనులు పూర్తయిన తర్వాత లిఫ్ట్ డౌన్ చేయకుండా రోడ్డుపైకి రావడంతో విద్యుత్‌వైర్ టిప్పర్ మధ్యలో చిక్కుకుంది.అది గమనించని ట్రిప్పర్ డ్రైవర్ ముందుకు వెళ్లడంతో విద్యుత్ ఐటెమ్స్ మధ్య రాపిడ్ జరిగి మంటలు వచ్చి పెద్ద శబ్దం వచ్చింది. దీంతో గ్రామస్తులందరూ ఒక్కసారిగా రోడ్డు మీదకి ఎక్కి పోర్టు వాహనాలను అడ్డుకున్నారు. సమస్య పరిష్కరించేంతవరకువాహనాలను కదలనీయమని రోడ్డుమీద గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. వాహనాల డ్రైవర్లు ఇష్టారాజ్యంగా నడవడం వలన విద్యుత్ వైర్లు తెగి ఇంటిలో టీవీలు ఫ్రిజ్లు దగ్ధమయ్యవని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కూడా ఇదే తంతు జరిగినప్పటికీ సంబందించిన యాజమాన్యం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ట్రాఫిక్ అంతరాయంతో ఏర్పడడంతో సంఘటన స్థలానికి సంతబొమ్మాళి ఎస్సై వై. సింహాచలం చేరుకున్నారు. గ్రామస్తులతో మాట్లాడిన సెసమెరా అనడంతో గంటల తరబడి వాహనాలను కదలనియలేదు. దీంతో పోర్టు హెచ్ ఆర్ మేనేజర్ రాఘవరెడ్డి సంఘటనా స్థలానికి వచ్చి సమస్యను పరిష్కరించే బాధ్యత యాజమాన్యం తీసుకుంటుందని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.

మృతుల కుటుంబాలకు రాజేష్ పరామర్శ

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలంలో పలు గ్రామాలలో అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందిన మృతుల కుటుంబాలకు జనసేన పార్టీ నాయకులు, జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కలింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్ పరామర్శించారు.కవిటి కాలనీలో పోల్లాయి శ్యామ్, బెజ్జిపుట్టుగ గ్రామంలో బార్ల హైమావతి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న లోల్ల రాజేష్ ఆ కుటుంబాలను పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన టీడీపీ నాయకులు పిసిని

విశాలాంధ్ర-రణస్థలం: కోష్ట పంచాయతీ పల్లెపేట గ్రామం నుంచి శ్మశానవాటికకు వెళ్ళే దారిలో తుప్పలు, గుంతలు వల్ల అంతిమ సంస్కారాలకు ఇబ్బంది అయ్యేది. అందువల్ల ఈ సమస్య కి పరిష్కారం చూపుతూ మంగళవారం ఉదయం సీసీ రోడ్డు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు పిషిని జగన్నాథం నాయుడు, ఎంపీటీసీ పిసిని ఆసిరినాయుడు, మాజీ ఎంపీటీసీ పైడి అప్పుడుదొర, యువనాయకులు పిషిని హరిక్రిష్ణ పిసిని అప్పలనాయుడు సచివాలయం సెక్రటరీ సచివాలయం సిబ్బంది, పల్లెపేట శ్రీరామ సంఘం సభ్యులు మరియు కూటమి నాయకులు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. అతి త్వరలోనే రోడ్డు పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన బిఎస్ అండ్ జేఆర్ విద్యార్థులు

విశాలాంధ్ర-టెక్కలి: ఇటీవల రాష్ట్రస్థాయి పోటీలలో మండలంలోని స్థానిక బిఎస్ అండ్ జేఆర్ విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచి పతాకాలు సాధించుకున్నారని బిఎస్ అండ్ జేఆర్ కరస్పాండెంట్ కోట మురళీధర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఇటీవల అనంతపురం జిల్లా జరిగిన రాష్ట్రస్థాయి జూడో పోటీలలో అండర్ 19, 44 కేజీల విభాగంలో కళాశాలకు చెందిన విద్యార్థిని కిల్లి కావ్య రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానంలో గెలుపొంది బ్రాంజ్ మెడల్ సాధించిందని తెలిపారు. అలాగే కర్నూలు జిల్లాలో రాష్ట్రస్థాయి అండర్ 19 గట్కా పోటీలలో వడాల అభిషేక్ అనే విద్యార్థి ప్రథమ స్థానంలో గెలుపొంది బంగారు మెడల్ సాధించుకున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని, క్రీడల్లో వచ్చిన పతాకాలు ద్వారా భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కోత శ్రీనివాసరావు, అధ్యాపకులు బ్రహ్మానందం, అప్పన్న, సోమేశ్వరరావు, నారాయణరావు, జూడో కోచ్ పి ఎం

4న బీఆర్ఏయూలో న్యాయ విద్య మిగులు సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో మూడేళ్ల న్యాయ విద్యా కోర్సులో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 4న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య తెలిపారు. లా సెట్-2025లో అర్హత సాధించి, రెండు కౌన్సెలింగ్లో కూడా ఏ కళాశాలలో కూడా చేరని విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లకు అర్హులని చెప్పారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, బదిలీ, స్టడీ, నివాస ధృవీకరణ పత్రాలు, లాసెట్ ర్యాంకు కార్డుతో నేరుగా వర్సిటీకి హాజరుకావాలన్నారు. సీట్లు పొందినవారికి వర్సిటీ నుంచి సమాచారం తెలియజేస్తామన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర- సంతబొమ్మాళి: సంతబొమ్మాళి మండలం దండు గోపాలపురం గ్రామంలో ప్రభుత్వ దాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఆకస్మికతనికి నిర్వహించారు. కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులు ఇతర వ్యాపారులకు అమ్మి మోసపోవద్దని తెలియజేశారు. ఇప్పటివరకు కొనుగోలు జరిగిన డేటాను కంప్యూటర్లో పరిశీలించారు. జిల్లా ఎడి త్రినాధస్వామి, టెక్కలి రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం కృష్ణమూర్తి, దండు గోపాలపురం మాజీ సర్పంచ్ ఆరంగి వసంతరావు, సంతబొమ్మాలి మండలం తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు బెండి అరుణ్ కుమార్, ఏవో రాళ్లపాటి అప్పారావు ఉన్నారు.

రైస్ మిల్లర్స్ ని తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్

విశాలాంధ్ర-ఎల్ ఎన్ పేట: మండలంలోని ఉన్న రైతులు వద్ద నుంచి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. మంగళవారం ఎల్ ఎన్ పేట మండల పరిధిలో ధాన్యం కొనుగోలు చేస్తున్న రైస్ మిల్లులను ఆయన తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఇంటర్నెట్ సిగ్నల్స్ సంబంధించి సాంకేతిక సమస్యలు ఉంటే వైఫై ని వినియోగించుకొని రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలన్నారు. జాయింట్ కలెక్టర్ తో పాటు ఎల్ ఎన్ పేట తహసిల్దార్ జె.ఈశ్వరమ్మ, వీఆర్వో రమణమ్మ తదితరులు ఉన్నారు.

గట్కా జాతీయ స్థాయి పోటీలకు అభిషేక్

విశాలాంధ్ర-టెక్కలి: ఈ నెల కర్నూల్ లో ఎస్జిఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన అండర్ 19 రాష్ట్ర స్థాయి గట్కా పోటీల్లో టెక్కలి ఎన్టీఆర్ క్రీడా వికాస్ కేంద్రం నుండి వడాల అభిషేక్ స్వర్ణ పతకం కోచ్ నర్సిపురం శేఖర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి నెల 6వ తేది నుండి 12వ తేదీల్లో పంజాబ్ రాష్ట్రంలో గల లుధియానాలో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరుపున పాల్గొంటాడని కోచ్ నర్సిపురం శేఖర్ తెలిపారు. విజేత అభిషేక్ మరియు కోచ్ కు జిల్లా క్రీడా శాఖ అధికారి (డిఎస్డిఓ) మహేశ్వర్ రావు తదితరులు అభినందనలు తెలియజేశారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

విశాలాంధ్ర-ఆమదాలవలస: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని జి ఎస్ డబ్ల్యూ ఎస్ అధికారి సేపాన రామ్మోహన్ అన్నారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత మంగళవారం దూసి సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని, అలాగే కార్యాలయానికి వచ్చిన లబ్ధిదారుల పట్ల గౌరవంగా వ్యవహరించి వారి పనిని వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. పౌర సేవలకు ఎటువంటి అలసత్వం వహించరాదని తెలి పారు. గ్రామ, వార్డు సచివాలయాలకు ప్రభుత్వం నోడల్ అధికారులుగా జి ఎస్ డబ్ల్యూ ఎస్ అధి కారులను ఇటీవల నియమించింది. అందులో భాగంగా ఆముదాలవలసకు రామ్మోహన్ను నియ మించారు. ఇంతకుముందు జిల్లా పరిషత్ లో పనిచేసేవారు. సచివాలయాల్లో పౌర సేవలు సత్వర పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వ హించాల్సి ఉంది. ప్రజలకు అవసరమైన సేవలను అందించటం అందుకు తగిన సూచనలను సిబ్బందికి తెలియజేశారు.

గరీబులు గెడ్డ పరిశీలన

విశాలాంధ్ర - సంతబొమ్మాలి: సంతబొమ్మాలి మండలం గోదలం వద్ద గల గరీబుల గడ్డ ఏపీ ఎస్ఐ డిసి సూపర్డెంట్ సుబ్రహ్మణ్యం, సంబందించిన అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈనెల 1న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు పలు అభివృద్ధి కార్యక్రమాలు శంకుస్థాపనలు, పింఛను పంపిణీకి వచ్చిన సమయంలో కొల్లిపాడు, బోరుభద్ర, మలగాం గ్రామాలకు చెందిన రైతులు గరీబులు గెడ్డ నీరు వృధాగా తంపర్లోకి సముద్రంలోకి పోతుందని ఎత్తిపోతల పథకము ద్వారా పంట పొలాలకు అందిస్తే పంటలు సమృద్ధిగా పండుతాయని ఆయా పంచాయతీ లకు చెందిన నాయుకులు, రైతులు కోరారు. ఎన్నికల హామీలులో

భాగంగా ప్రతి పథకం విజయవంతంగా ప్రజలకు అందిస్తున్న నేపథ్యంలో మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు వచ్చి పరిశీలించారు. సాధ్యాసాధ్యాలను మంత్రి అచ్చం నాయుడుకు, ఉన్నతాధికారులకు నివేదిస్తామని సంబంధిత ఎస్ ఈ తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన టీడీపీ నాయుకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రతీ కార్యాలయంలో ఈ-ఆఫీసు తప్పనిసరి

- దస్త్రాల్ని పెండింగ్‌లో పెట్టొద్దు
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశం

విశాలాంధ్ర-శ్రీకాకుళం: వచ్చే వారానికల్లా జిల్లాలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఈ-ఆఫీసు వ్యవస్థను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన ప్రభుత్వ విభాగాల వారీగా దస్త్రాల పరిష్కారంపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. దస్త్రాల పరిష్కారంలో వేగం పెంచడానికి అధికారులను అప్రమత్తం చేసేందుకే ఈ సమీక్ష అని ఆయన తెలిపారు. ఆర్థికాంశాలతో ముడిపడని దస్త్రాల్ని, మరీ సంక్లిష్టమైన అంశమైతే తప్ప, వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ-ఆఫీసు దస్త్రాల పరిష్కారంలో వెనుకబడిన ఇచ్ఛాపురం, ఆమదాలవలస, పలాస మున్సిపాలిటీలు, ఏపీఎస్ఐడీసీ, జిల్లా రిజిస్ట్రార్ వంటి శాఖలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ విషయంలో ప్రత్యేకంగా ఉందని, జనవరి నుంచి డిసెంబర్ మొదటి వరకు ఒక్క దస్త్రాన్ని కూడా ఈ-ఆఫీస్ ద్వారా పరిష్కరించని వారు వచ్చే సోమవారానికల్లా ప్రగతి కనబరచాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- పారిశుధ్యం పై అప్రమత్తంగా ఉండాలి...

సంతబొమ్మాళి మండలం తాళ్లవలసలో జరిగిన ఘటనపై కలెక్టర్ మాట్లాడుతూ, ఆహారం, నీరు, పారిశుద్ధ్యం విషయంలో జిల్లా మొత్తం ఆయా ప్రభుత్వ విభాగాలు అప్రమత్తంగా ఉండాలి అని స్పష్టం చేశారు. ప్రజల్లో అవగాహన పెంచడానికి తక్షణమే కాంపెయిన్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ ప్రచారం ద్వారా ప్రజలు కాచి చల్లార్చిన నీటిని వినియోగించాలి, వేడి ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని తెలియజేయాలన్నారు. ఆహార కల్తీ విభాగానికి చెందిన అధికారులు హెూటల్స్, సినిమా హాళ్లు, రోడ్డు సైడ్ ఫుడ్ స్టాళ్లపై వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించాలని, వారందరికీ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. తనిఖీల పేరుతో వీధి వ్యాపారులను ఇబ్బంది పెట్టరాదని స్పష్టం చేశారు.

అలాగే పలు శాఖల ప్రగతి అంశాలపై, ముఖ్యంగా ధాన్యం సేకరణ అంశంలో బ్యాంక్ గ్యారెంటీలు, వాహనాల రిజిస్ట్రేషన్, తార్పాలిన్ లభ్యతపై చర్చించారు. ఇటీవల వచ్చిన తుఫాను అనంతర వర్షాల కారణంగా జరిగిన ధాన్యం నష్టం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సానుకూల ప్రజాభిప్రాయం కోసం పింఛన్లు, వ్యవసాయం, ప్రభుత్వ ఆసుపత్రి సేవలు, రెవెన్యూ సర్వే సేవలు, ఏపీఎస్ఆర్టీసీ సేవలు వంటి అంశాలపై అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం విషయంలో శానిటరీ వర్కర్ల హాజరు, వాహనాల మ్యాపింగ్, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల నిర్వహణ, ఒక మోడల్ గ్రామాన్ని ఎంపిక చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. చివరగా, సీజనల్ వ్యాధుల నివారణకు ఆసుపత్రులలో మందుల పంపిణీ, పారిశుద్ధ్యం రోగ నిర్ధారణ సేవలను మెరుగుపరచాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్ తదితర అధికారులు హాజరయ్యారు.

మైనర్ డిగ్రీ కోర్సులుగా కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్లో మైనర్ డిగ్రీ కోర్సులుగా ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్తగా కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతం కోర్సులను ప్రారంభిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ తెలిపారు. ఇక్కడి క్యాంపస్లో మంగళవారం ఈ కోర్సులను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీ నిబంధనల ప్రకారం ఇవి 20 క్రెడిట్ కోర్సులు అని, ఇంజ నీరింగ్ ద్వితీయ

సంవత్సరం నుంచి చివరి సంవత్సరం వరకు కొనసాగుతుందన్నారు. వీటితో పాటు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, క్వాంటమ్ టెక్నాలజీ కోర్సులను కూడా మైనర్ డిగ్రీలుగా ఆఫర్ చేస్తున్నామన్నారు. విద్యార్థుల ఆసక్తి మేరకు ఈ కోర్సులను ఎం పిక చేసుకోవచ్చున్నారు. ఇంజనీరింగ్ డిగ్రీ మేజర్, మైనర్గా ఈ కొత్త కోర్సులను గుర్తిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్యాం పస్ ఏవో డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలలో సొండిపూడి విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-మందస: మండలం జి ఆర్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన గ్రిగ్స్ క్రీడా పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సొండిపూడి విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు క్రీడల్లో విజయం సాధించారు. సీనియర్ బాలుర కబడ్డీ పోటీలో హరిపురంపై ఫైనల్ లో గెలిచి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. అలాగే బాలికల కబడ్డీ పోటీల్లో ఫైనల్స్ లో బహడపల్లి హైస్కూల్ పై విజయం సాధించి ప్రథమ స్థానం సంపాదించారు. వీరు త్వరలో జరగనున్న జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనేందుకు సంసిద్ధులుగా ఉన్నారు, అలాగే పిట్ట .రాహుల్ ఇటీవల పల్నాడు జిల్లా వెనుగొండలో జరిగిన స్టేట్ మీట్ లో1500 మీటర్ల పరుగు పందెంలో ఏడో స్థానం సంపాదించి మండలానికి ఆదర్శంగా నిలిచాడు , అలాగే హరిపురంలో జరిగిన ఎన్ఎంఎంఎస్ మాక్ టెస్ట్ లో 120 మార్కులు సంపాదించి, లండ కౌశిక్ ఐదవ స్థానంలో నిలవడం గమనించదగ్గ విషయం. ఈ మూడు విజయాలను దృష్టిలో పెట్టుకొని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ సుందర సాల్మన్ గారు , పాఠశాల పి.డి ,ఎస్ .విజయ్ గారిని అభినందిస్తూ, రానున్న పదవ తరగతి పరీక్షల్లో కూడా మంచి మార్కులు సాధించి పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగిరి .కరుణాకర్, వై. తులసీదాస్ ,నగిరి అరుణ్ కుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు తగదు

- కూన రవికుమార్ ఒక బ్రాండ్
- తప్పుడు ఆరోపణలు చేస్తే ఇంటికొచ్చి వాయిస్తాం
- వైసిపి ఆరోపణలపై టిడిపి నాయకుల మండిపాటు

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఎమ్మెల్యే పై ఎమ్మెల్యే అసత్య ఆరోపణలు చేస్తే వైసీపీ సమన్వయకర్త ఎమ్మెల్యే అయిపోతారన్న అహంభా వంలో ఉన్నారా అని తెలుగుదేశం పార్టీ నాయకులు మండిపడ్డారు. మంగళవారం కార్యాలయంలో నిర్వ హించిన విలేకరుల సమావేశంలో పట్టణ అధ్యక్షులు సంపద రావు మురళీధర్ రావు, కార్యాలయ కార్య దర్శి మొదలవలస రమేష్, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ మాజీ చైర్పర్సన్ తమ్మి నేని గీతాసాగర్ తదితరులు మాట్లాడారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక తప్పుడు ఆరో పణలు చేస్తున్నారని ఇది మీ ఔన్నత్యానికి తగద న్నారు. ఏ క్యాడరు లేని నీకు వైసిపి లీడర్ ను చేస్తే ఎమ్మెల్యేని విమర్శించే స్థాయికి ఎదిగి పోయావా అంటూ దుయ్యబట్టారు. అరాచకాలు దౌర్జన్యాలు దోపిడీలు శవాల పైన నిర్మించేది వైసిపి పార్టీ అయితే ధ్యేయంగా ఒక విజన్ ఉన్న నాయకుని శిక్షణలో ఉన్న టిడిపి పార్టీ వ్యక్తులను విమర్శించే స్థాయి నీకు లేద న్నారు. సరుబుజ్జిలో జరిగిన వైన్ షాప్ లో పనిచేసిన నౌకరినామ వ్యక్తితో పాటు రమణ పోలీసులకు ఇచ్చి న వివరణను ఒక్కసారి చూసుకోవాలని హితోపలి కారు. డబ్బులు కు ఆశపడి తప్పు పని చేశామని పనివారు లే ఒప్పుకున్నారని అయినప్పటికీ నాలుగో ముద్దాయిగా షాపు ఓనర్ ముఖలింగం పైన కూడా కేసు నమోదు చేశారని అది కూడా మా ప్రభుత్వ హయాంలోనే చేశామని స్పష్టం చేశారు. ఎన్నికలైన తరువాత రిజల్ట్ రాకముందే ఆయన గోవా పర్యట నలో ఉన్నారని వైన్ షాపులు వచ్చిన తర్వాత కాదని తెలిపారు. చౌకబారు ఆరోపణలు తగదని

ఇటువంటి ఆరోపణలతో ఎమ్మెల్యే ప్రతిష్టను భంగం కలిగించా లని ప్రయత్నం చేస్తే చింతాడ రవికుమార్ ఇంటిని ముట్టడించి, ఇంటికి వచ్చి వాయిస్తామమని హెచ్చ రించారు. షాపుల్లో పనిచేస్తున్న వారు వైసీపీ సభ్య త్వం ఉన్నవారే అని గుర్తు చేశారు. వ్యాపారం చేసు కునే వారికి బాగా పనిచేసేవారిని పనిలో ఉంచుకుం టారని విద్యావేత్త అని చెప్పుకుంటున్న నీకు తెలి యదా అన్నారు. ఎమ్మెల్యే పై చేస్తున్న ఆరోపణలు తన వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించేలా ఉన్నా యని దీనిపై చర్చించి పరువు నష్టం దావా వేస్తామ న్నారు. అభివృద్ధి ధ్యేయంగా పనిచేసే వారిపై అవాకు లు చవాకులు మానుకొని ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజా సేవ చేసుకుని పైకి రావాలి అన్నారు. 1947 నుంచి వారిది జమీందారీ వంశమని మీలా రోడ్లపై వ్యక్తి ఎమ్మెల్యే కాదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే రవికుమార్ అంటే పేదలకు ఒక భరోసాని తెలిపారు. ఎవరో పని వారు చేసిన తప్పులను ఎమ్మెల్యే పై నెట్టడం సరి కాదని ఫరీద్ పేటకు చెందిన కొత్తకోట అమ్మి నాయు డు అన్నారు. న్యాయబద్ధంగా ప్రభుత్వ నిబంధనలను అనుసరించి మద్యం షాపు దక్కించుకున్నామని ఎవరో కేటాయించింది కాదని తెలిపారు. పనిచేసే వద్ద ఓనర్లు ఉండరని వైసిపి వారు తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు బోయిన సునీత, పిఎసిఎస్ అధ్యక్షులు శిమ్మ మాధవి, టిడిపి నాయకురాలు ఎన్ని శ్రీదేవి, మాజీ మునిసిపల్ ఉపాధ్యక్షురాలు కూన వెంకట రాజ్య లక్ష్మి, తంగి గురయ్యా, అప్పారావు తదితరులు ఉన్నారు.

రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : రాష్ట్ర రెడ్డిక సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌గా బెల్లుపడాకు చెందిన కొండా శంకర్‌ను నియమించిన నేపథ్యంలో అతన్ని మంగళవారం ఘనంగా సన్మానించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ మహిళా కార్యదర్శి ఆశి లీలారాణి ఆధ్వర్యంలో బెల్లుపడా సచివాలయం వద్ద రెడ్డిక కుల పెద్దలు, యువత కొండా శంకర్‌ను దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించి అభినందించార. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించబడినందుకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్‌కు సర్వదా కృతజ్ఞతగా ఉంటానని, రెడ్డిక కులస్థుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో బెల్లుపడా నీటి సంఘం అధ్యక్షులు కొచ్చెర్ల దనుంజయ, తిప్పన భాస్కర్, తెలుగు యువత అధ్యక్షుడు ఆశి ధర్మరాజు, తిప్పన కూర్మారావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.